మహిళా దినోత్సవం

సాక్షి
గుంటూరు

రేపటికి ముందడుగు



శుక్రవారం । 8 । మార్చి । 2024

మహిళలకే అగ్రతాంబూలం

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో అన్నిరంగాల్లో మహిళలే అగ్రతాంబూలం ఇస్తున్నారు. రాష్ట్రంలో ఏకంగా ఎన్నడూ లేని విధంగా 32లక్షల మందికి ఇళ్ల స్థలాలు అందజేయటంతో పాటు, పూర్తిస్థాయిలో వారికే హక్కులు కల్పించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో మహిళలే మహారాణులు అనేది సుస్పష్టం. మహిళా సాధికారిత సీఎం వైఎస్ జగనన్న ద్వారానే సాధ్యపడుతుంది. గత ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన ప్రతి హామీని విస్మరించింది. సీఎం వైఎస్ జగన్ మహిళలకు ఇచ్చిన ప్రతి హామీని నేరవేర్చారు. వైఎస్సార్ చేయూత ద్వారా మహిళల ఆత్మగౌరవాన్ని పెంచారు. అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, డ్వాక్రా రుణమాఫీ వంటి ఎన్నో పథకాలను మహిళలకు చేరువ చేశారు. సీఎం వైఎస్ జగనన్న మహిళల పక్షపాతి అనేది సుస్పష్టం.

అన్నిరంగాల్లో అతివలకే అగ్రపీఠం

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రంలో మహిళా సాధికారత పెరిగింది. కుటుంబాన్ని చక్కదిద్దడంలో కీలకపాత్ర పోషిస్తున్న మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణిస్తున్నారు. మానవాళి మనుగడను ముందుకు తీసుకెళ్లడంలో ఎంతో కీలకమైన మహిళలు పురుషులతో సమానంగా విద్య, వైద్య, క్రీడా, రాజకీయ రంగాల్లో పైచేయి సాధిస్తున్నారు. రాష్ట్రంలో రాజకీయంగా 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలను గౌరవప్రదమైన స్థానంలో నిలిపారు. ఆయన ఇచ్చిన ప్రోత్సాహంతో అట్టడుగువర్గాలకు చెందిన అతివలు రాజకీయ, నామినేటెడ్ పదవుల్లో రాణిస్తున్నారు. సమాజంలో మహిళా చైతన్యం పెరగడంతో పాటు బాలికా విద్యకు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తోంది.

మహిళా సాధికారతకు పెద్దపీట

ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



తాడికొండ: మహిళా సాధికారతకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేసింది. ప్రతి పథకాన్ని మహిళలకు అందజేస్తూ ఇళ్ల స్థలా లు, పక్కా ఇళ్ల నిర్మాణం, అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, ఆసరా వంటి పలు పథకాలను మహిళలకు ఇచ్చి వారిని ఆర్థికంగా లక్షాధికారులను చేశారు. మహిళల భద్రత కోసం దిశ చట్టాన్ని అమలు చేసి ఆ చట్టాలను సక్రమంగా అమలు చేసేందుకు ప్రత్యేక పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. ఏపీకి మొట్టమొదటి హోం మంత్రిగా ఓ దళిత మహిళనైన నన్ను జగనన్న నియమించారు. పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాలలో ముందంజలో నడుస్తున్నారనేందుకు ఏపీని ఉదాహరణగా తీసుకోవచ్చు.

న్యూస్‌రీల్

క్వారీ తిరునాళ్లకు ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

నగరంపాలెం: చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ వద్ద బాలకోటేశ్వరస్వామి వారి ఆలయంలో శుక్రవారం జరగనున్న మహా శివరాత్రి పండుగ సందర్భంగా ట్రాఫిక్ మళ్లించినట్లు తెనాలి డీఎస్పీ రమేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8 మధ్యాహ్నం 12 గంటల నుంచి శనివారం ఉదయం 6 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపు కొనసాగుతుందని చెప్పారు.

- చేబ్రోలు– ముట్లూరు రోడ్డు: బాపట్ల, పొన్నూరు నుంచి గుంటూరు వెళ్లే వాహనాలన్నీ ముట్లూరురోడ్డు మీదుగా పాతరెడ్డిపాలెం, లేమల్లెపాడు క్రాస్ రోడ్ మీదగా వెళ్లాలి.
- వడ్లమూడి క్రాస్ రోడ్ చేబ్రోలు గ్రామం: బాపట్ల, పొన్నూరు నుంచి తెనాలి వెళ్లే వాహనాలు చేబ్రోలు మసీదు సెంటర్ మీదగా వడ్లముడి అడ్డరోడ్డు, వడ్లముడి గ్రామం వైపు వెళ్లాలి. చేబ్రోలు వాసులు గుడి దర్శనానికి వెళ్లేందుకు అదే మార్గంలో పయనించాలి.
- వడ్లమూడి క్రాస్ రోడ్: తెనాలి నుంచి పొన్నూరు వెళ్లే వాహనాలు వడ్లమూడి క్రాస్ రోడ్ మీదుగా పొన్నూరు/ చేబ్రోలు వెళ్ళాలి.
- తెనాలి ఫ్లైఓవర్: గుంటూరు వైపు వచ్చే భారీ వాహనాలను నందివెలుగు రోడ్ వైపుగా వెళ్లాల్సి ఉంది. ఇక క్వారీకి వచ్చే ఆర్టీసీ బస్సులను మాత్రమే అనుమతించాలి.
- బుడంపాడు ఫ్లైఓవర్: గుంటూరు నుంచి బాపట్ల, పొన్నూరు వెళ్లే వాహనాలు అనంతవరప్పాడు అడ్డరోడ్డు మీదుగా అనంతవరప్పాడు, లేమల్లెపాడు, చేబ్రోలుకు వెళ్లాలి.



విద్యుద్దీపాల అలంకరణతో కళకళలాడుతున్న పెదకాకాని శివాలయం



విద్యుత్ వెలుగుల్లో కోటప్పకొండ ఆలయ గాలిగోపురం



చేబ్రోలు క్వారీ తిరునాళ్లకు సిద్ధమైన దేవాలయం

ఏ పూలు తేవాలి నీ పూజకు..

మహాశివరాత్రి పర్వదినం భక్తులకు ముక్తిదాయకం. అందునా శైవక్షేత్రాల్లో శివయ్య దర్శనం కోసం భక్తులు బారులుతీరి కనపడతారు. ఎందుకంటే ఈశ్వరుడిని అడిగిన తరువాత ఇక మరొకటి ఎవరినీ అడగాల్సిన అవసరం రానివ్వడన్న భావనతో. 'శంకరా అంటే నాకు చక్కెర లెక్కనుంటాది' అని భక్తిగా అర్చించినా, 'చేతులారంగ శివుని పూజింపడేని, నోరునొవ్వంగ హరికీర్తి నుడవడేని' అని సేవించినా ఇట్టే అనుగ్రహమిచ్చే స్వామి సదాశివుడు. ఇవాళ ఆ స్వామి లింగోద్భవ వేళలో దర్శనమిచ్చిన పర్వదినం. 'తలమీద చెంబుడు నీళ్లు పోసి శంకరా!' అని ఆర్తిగా పిలిస్తే కరిగిపోయే తత్వం ఆ సదాశివుడిది. 'ఇందుగలడందు లేడని' అన్నట్లుగా స్వామి ఉమ్మడి గుంటూరు జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో ప్రతిష్టుతుడై భక్తులను అనుగ్రహిస్తూ పూజలందుకుంటున్నాడు. అందునా ప్రధానంగా త్రికూటాద్రిపై (కోటప్పకొండ) మేథా దక్షిణామూర్తిగా (కోటయ్య స్వామి) కొలువుదీరి భక్తులను విశేషంగా అనుగ్రహిస్తున్నారు. ఆయనకు ప్రభ కట్టుకుని వెళ్లి దర్శించుకుంటే కోరిన వరాలనిస్తాడని ప్రతీతి. ఇక కృష్ణా తీరంలో (అమరావతి) కొలువై ఉన్న అమరేశ్వరుడి దర్శనం ముక్తిదాయకంగా చెబుతారు. పెదకాకాని , గోవాడ, చేజర్ల, క్వారీ, సత్రశాల వంటి ప్రాంతాల్లో స్వామి వేర్వేరు పేర్లతో కొలువుదీరి భక్తులను అనుగ్రహిస్తున్నారు. – సాక్షి, నెట్‌వర్క్

మహిళల ఆర్థిక స్వేచ్ఛకు ప్రభుత్వం కృషి



లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు

- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి
- వైఎస్సార్ చేయూత నాలుగో ఏడాది నిధులు మంజూరు
- జిల్లాలో 93,275 మంది మహిళల ఖాతాల్లోకి రూ.174.88 కోట్లు జమ

గుంటూరు వెస్ట్: మహిళా సాధికారత, వారి ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. గురువారం అనకాపల్లిలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన 4వ విడత వైఎస్సార్ చేయూత పథకం నిధుల మంజూరు కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారుల విద్య కోసం నాడు-నేడు పాఠశాలల అభివృద్ధితోపాటు జగనన్న విద్యా దీవెన తదితర పథకాలు క్రమం తప్పకుండా అమలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్ చేయూత పథకంలో భాగంగా ప్రభుత్వం 45-60 ఏళ్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు ఏడాదికి రూ.18,750 చొప్పున నాలుగేళ్లకు రూ.75,000 అందిస్తున్నామన్నారు. 4వ విడతలో జిల్లాలో 93,275 మంది మహిళల ఖాతాల్లోకి రూ.174.88 కోట్లు ముఖ్యమంత్రి నేరుగా జమ చేశారన్నారు. ఈ ఒక్క పథకం ద్వారా జిల్లాలో ఇప్పటివరకు రూ.708 కోట్లు మహిళలకు అందాయని చెప్పారు. సంక్షేమ పాలనలో మన రాష్ట్రం దేశానికే ఆదర్శమన్నారు. అనంతరం లబ్ధిదారులకు కలెక్టర్ మెగా చెక్కు అందజేశారు. కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, వృద్ధులు, వికలాంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన ముంతాజ్ పఠాన్, కృష్ణ బలిజ, పూసల కార్పొరేషన్ చైర్‌పర్సన్ కోలా భవాని మణికంఠ, జిల్లా డీసీఎస్ఎం చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్ పాల్గొన్నారు.

ఇంతకంటే మేలు చేసే ప్రభుత్వం ఏదీ లేదు

ఈ ప్రభుత్వంలో మాలాంటి వెనుకబడిన మహిళలకు ఒక భరోసా వచ్చింది. నాకు ఇంటి స్థలంతోపాటు చేయూత పథకం ప్రతి ఏడాది వచ్చింది. ఒక్క రూపాయి లంచం లేకుండా వలంటీర్లు అర్జీలు పెట్టించారు. ఇంతకంటే మంచి చేసే ప్రభుత్వం మరొకటి లేదు, రాదు. జగన్‌బాబుతోనే మేమందరం.

– దాసరి వెంకాయమ్మ, చినపలకలూరు

వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులుగా 'నిమ్మకాయల'

ప్రత్తిపాడు నియోజకవర్గ పరిశీలకులుగా అవుతు శ్రీనివాసరెడ్డి

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులుగా నిమ్మకాయల రాజనారాయణ, ప్రత్తిపాడు నియోజకవర్గ పరిశీలకులుగా అవుతు శ్రీనివాసరెడ్డిలను నియమిస్తూ గురువారం ఆదేశాలు జారీ అయ్యాయి. ఈమేరకు కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇకపై మంగళగిరికి నిమ్మకాయల రాజనారాయణ, ప్రత్తిపాడుకు అవుతు శ్రీనివాసరెడ్డిలు నియోజకవర్గ పార్టీ పరిశీలకులుగా వ్యవహరించనున్నారు.

'కరుణా సాగర ఏసయ్యా..'

- భక్తిశ్రద్ధలతో ప్రారంభమైన హోసన్నా గుడారాల పండుగలు
- ప్రత్యేక ప్రార్థనలు, స్తుతి గీతాలతో మారుమోగిన ప్రార్థనా ప్రాంగణం
- 47వ గుడారాల పండుగ శుభాకాంక్షలు తెలిపిన మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం, మినిస్ట్రీస్ చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ
- మొదటిరోజు 2 లక్షల మందికిపైగా విశ్వాసులు రాక



స్తుతి ఆరాధన చేస్తున్న బ్రదర్ అబ్రహాం తదితరులు

గుంటూరు రూరల్: ఏసు క్రీస్తు అద్భుతాలు చేసేందుకు భూమిపైకి వచ్చాడని హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం, చీఫ్ పాస్టర్ జాన్ వెస్లీలు తెలిపారు. ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా క్రీస్తుని నామాన్ని ఘనపరుస్తూ నిర్వహించే గుడారాల పండుగ ప్రత్యేక ప్రార్థనలు గురువారం ప్రారంభించారు. మొదటిరోజు ప్రత్యేక ప్రార్థనలను తమిళనాడుకు చెందిన పాస్టర్ మోహన్ సీ లాజరస్ ప్రత్యేక ప్రార్థన చేసి ప్రారంభించారు. కరుణాసాగర ఏసయ్య అనే ప్రత్యేక గీతం ఆలపించగా లక్షలాదిమంది విశ్వాసులు గొంతుపలికారు. అనంతరం బ్రదర్ అబ్రహాం, పాస్టర్ జాన్‌వెస్లీ, పాస్టర్ ఫ్రెడిపాల్, పాస్టర్ రాజు, పాస్టర్ రమేష్‌లు, ప్రత్యేక స్తుతి గీతాలను ఆలపించి శాంతి కపోతాలను ఎగురవేసి, బెలూన్లు వదిలి ప్రత్యేక ప్రార్థనలను ప్రారంభించారు. ప్రేమా పూర్ణుడా అనే క్రీస్తుని స్తుతి గీతాన్ని ఆలపించారు. అనంతరం 47వ గుడారాల పండుగ ప్రత్యేక పాటల పుస్తకాన్ని అమెరికాకు చెందిన ఎర్నెస్ట్ పాల్ పాస్టర్ ఆవిష్కరించారు. నిత్య తేజోమయుడా పాటల ఆల్బమ్‌ను మదనపల్లికి చెందిన పాస్టర్ రాజశేఖర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా బ్రదర్ అబ్రహాం నూతన పాటల రచయిత కమలాకర్ కోసం ప్రత్యేక ప్రార్థన చేశారు. కరుణా సాగర ఏసయ్య.. కనుపాప వలె కాచితివి, ఉన్నతమైన ప్రేమతో మనసును మహిమపరిచితివి అనే గీతాన్ని లక్షలాది మంది భక్తులతో కలిసి ఆలపించారు. అనంతరం మెల్టన్ లాజరస్ ప్రత్యేక ప్రార్థన చేశారు. ప్రత్యేక ప్రార్థనల్లో భక్తులు లక్షలాది మంది నిలబడి రెండుచేతులు ఎత్తి క్రీస్తుని నామాన్ని ఘనపరుస్తూ హల్లెలూయ, హోసన్నా అంటూ క్రీస్తుని నామాన్ని ఘనపరిచారు.



గుడారాల పండుగలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు



బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం పి.గుడిపాడులోని సిద్ధం సభా ప్రాంగణంలో సిద్ధం టీషర్టులను ఆవిష్కరిస్తున్న ఎంపీలు విజయసాయిరెడ్డి, నందిగం సురేష్, మండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి, పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, గుంటూరు తూర్పు సమన్వయకర్త నూరిఫాతిమా తదితరులు – మేదరమెట్ల

ఎన్నికల రణరంగానికి సన్నద్ధం

ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత



మహిళా దినోత్సవం కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్సీ పోతుల సునీత, పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా

పట్నంబజారు: రానున్న ఎన్నికల రణరంగానికి ప్రతి ఒక్కరూ సన్నద్ధం కావాలని ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకుని ముందస్తు వేడుకల్లో భాగంగా గురువారం బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. సభకు పార్టీ మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు బూరెల నాంచారమ్మ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా పోతుల సునీత మాట్లాడుతూ ఎన్నికల కురుక్షేత్రం సమీపిస్తున్న తరుణంలో ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని సూచించారు. ప్రతి ఎమ్మెల్యే అభ్యర్థితో మహిళ విభాగం నేతలు సమావేశాలు ఏర్పాటు చేసుకుని మండల స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు చేయాల్సిన పనుల గురించి సమీక్షించాలన్నారు. మహిళలను మహరాణులను చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. మహిళల అభ్యున్నతి, సాధికారత కోసం సీఎం జగన్ విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుని అమలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. మహిళ దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 8వ తేదీన ఉదయం 10 గంటలకు తాడేపల్లిలో జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలకు పెద్ద పీట వేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందన్నారు. వైఎస్సార్ సీపీ గుంటూరు తూర్పు సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ మనమంతా జగనన్న సైనికులమని, రానున్న ఎన్నికల పోరులో ఆయన పక్షాన పోరాడేందుకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ పోతుల సునీతను గజమాలతో సత్కరించారు.

76 మందికి స్టాఫ్‌నర్సుల నియామక ఉత్తర్వులు

గుంటూరు మెడికల్ : గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకుల కార్యాలయంలో గురువారం కౌన్సెలింగ్ నిర్వహించి 76 మంది కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులకు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో ఆర్డీ డాక్టర్ జి.శోభారాణి. డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్‌లు షేక్ నాగూర్ షరీఫ్, గోపవరపు స్టాన్లీ రాజ్‌కుమార్, షేక్ నాగూర్ షరీఫ్ పాల్గొన్నారు.

11న తెనాలి ఐటీఐలో అప్రంటీస్ మేళా

తెనాలిఅర్బన్: అప్రంటీస్ మేళాను తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 11న నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ రావి చినవెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 కంపెనీలకు చెందిన ప్రతినిధులు దీనిలో హాజరు కానున్నట్లు చెప్పారు. ఐటీఐలో ఫిట్టర్, టర్నర్, మెకానిస్ట్, ఎలక్ట్రిషియన్, వెల్డర్ వంటి కోర్సుల్లో అర్హత కలిగిన వారు తమ బయోడేటాతోపాటు విద్యార్హత సర్టిఫికెట్లు తీసుకుని ఉదయం 10గంటలకు మేళాలో హాజరు కావాలన్నారు. వివరాలకు సెల్ నెం .9014491772, 9959828100 లో సంప్రదించాలని సూచించారు.

వనదుర్గాదేవిగా భ్రమరాంబ

పెదకాకాని శివాలయంలో కళ్యాణ వేడుకలకు సర్వం సిద్ధం

పెదకాకాని: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహా శివరాత్రి కళ్యాణ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో రెండవరోజు భ్రమరాంబ అమ్మవారు వనదుర్గాదేవిగా భక్తులను అనుగ్రహించారు. దేవస్థానంలో గురువారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, మహాహారతులతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం 6 గంటలకు పంచహారతుల అనంతరం నరనంది వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

కల్యాణానికి ప్రత్యేక ఏర్పాట్లు..

శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని రాత్రి 11 గంటలకు లింగోద్భవకాలమున స్వామివారికి ఏకాదశ ద్రవ్యాలతో రుద్రాభిషేకం, 12 గంటలకు రావణ బ్రహ్మ వాహనంపై ఎదుర్కోలోత్సవం, తెల్లవారు జామున 2 గంటలకు కల్యాణోత్సవం వైభవంగా జరిపించేందుకు ప్రత్యేక ఏర్పాటు చేపట్టినట్లు ఆలయ డీసీ దాసర శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు.



నరనంది వాహనంపై గ్రామోత్సవానికి బయలు దేరిన భ్రమరాంబమల్లేశ్వరస్వామి

క్లుప్తంగా

అందరి దేవుడు.. క్వారీ బాలకోటేశ్వరుడు



చేబ్రోలు: మహాశివ రాత్రి పర్వదినం సందర్భంగా వడ్లమూడి క్వారీలోగల బాలకోటేశ్వరస్వామి దేవాలయం సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకొంది. రంగులతో ఆలయాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. జిల్లాలో కోటప్పకొండ తిరునాళ్ల తరువాత చెప్పుకోదగిన చేబ్రోలు వడ్లమూడి క్వారీ తిరునాళ్లకు ఓ ప్రత్యేకత ఉంది. భక్తుల కోర్కెలు తీర్చే దైవంగా బాలకోటేశ్వర స్వామి ఇక్కడ విరాజిల్లుతున్నాడు. సుమారు వందేళ్ల ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన ఆలయం వద్ద సుమారు 80 ఏళ్ల నుంచి తిరునాళ్ల జరుగుతోంది. మొట్టమొదటిసారిగా చేబ్రోలు మండలం గొడవర్రు గ్రామస్తులు ప్రభను తిరునాళ్లకు తీసుకువచ్చినట్లు సమాచారం. ఏటా తిరునాళ్లకు జిల్లా నలుమూల నుంచి లక్షమంది వరకు భక్తులు వస్తుంటారు. ఇక్కడి దేవుడికి మొక్కుకుంటే కోర్కెలు తీరతాయని భక్తుల నమ్మకం. అంతే కాదు ఈ దేవాలయం చుట్టూ తమ పశువులను తీసుకువచ్చి రైతులు ప్రదక్షిణలు చేయిస్తారు. నారాకోడూరు, గుండవరం, గొడవర్రు, సుద్దపల్లి, చేబ్రోలు, శలపాడు, శేకూరు, వడ్లమూడి గ్రామాలనుంచి 15 వరకు భారీ విద్యుత్ ప్రభలు, వందల సంఖ్యలో చిన్న ప్రభలు తిరునాళ్లకు దేవాలయానికి వస్తాయి.

విద్యా వ్యవస్థలో వలంటీర్ విధానం భేష్

- వెనిగండ్ల హైస్కూల్‌లో అమలు చేస్తున్న ప్రక్రియపై విద్యావేత్తలు, అధికారుల ప్రశంసలు
- బోధన బలోపేతానికి అద్భుతమైన ప్రక్రియ అంటూ మెచ్చుకోలు

గుంటూరు ఎడ్యుకేషన్: పెదకాకాని మండలం వెనిగండ్లలోని శ్రీవేమన జెడ్పీ ఉన్నత పాఠశాలలో అమలు చేస్తున్న విద్య వలంటీర్ వ్యవస్థపై విద్యావేత్తలు, అధికారులు ప్రశంసలు కురిపిస్తున్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధే ధ్యేయంగా గ్రామ పెద్దలు, పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక తరగతుల నిర్వహణ ద్వారా సాధిస్తున్న చక్కటి ఫలితాలపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. వెనిగండ్ల జెడ్పీ హైస్కూల్లో అమలు చేస్తున్న విద్య వలంటీర్ వ్యవస్థపై ''విద్యాకాంతులు మెరవాలంటీరో'' శీర్షికతో సాక్షిలో గురువారం ప్రచురించిన కథనానికి ఎమ్మెల్సీలతో పాటు విద్యాశాఖాధికారులు స్పందించారు. వెనిగండ్ల గ్రామపెద్దలు, పేరెంట్స్ కమిటీ, తల్లిదండ్రులు సమిష్టిగా తీసుకున్న నిర్ణయంతో వినూత్నమైన ఒరవడికి శ్రీకారం చుట్టిన తీరును అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విప్లవాత్మక మార్పులకు ఇది నాంది అంటూ ప్రశంసించారు.

ఉన్నతాధికారుల దృష్టికి..



వెనిగండ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్య వలంటీర్ విధానం సమాజంలో కొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఇటువంటి వ్యవస్థ ఉంటే విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దవచ్చు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.

–పి. శైలజ, డీఈవో, గుంటూరు

ఎంతో అద్భుతం



ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెడతాం వెనిగండ్ల జెడ్పీ హైస్కూల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న విద్య వలంటీర్ విధానం ఎంతో అద్భుతంగా ఉంది. మిగతా ప్రభుత్వ పాఠశాలలకు వెనిగండ్ల జెడ్పీ హైస్కూల్ ఆదర్శంగా నిలిచింది. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ గ్రామ పెద్దలు, పేరెంట్స్ కమిటీ కలిసి తల్లిదండ్రుల సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో బాగుంది.

–టి. కల్పలతారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ

సమష్టి కృషికి నిదర్శనం



వెయ్యి మందికి పైగా విద్యార్థులతో కళకళలాడుతున్న వెనిగండ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యారంగంలో ప్రత్యేకత సంతరించుకుంది. పాఠశాలలో టెన్త్‌పూర్తి చేసి బయటకు వెళుతున్న విద్యార్థులు వారి గ్రామంలోనే ఇంటర్మీడియెట్ అభ్యసించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేసిన ఫలితంగా గతేడాది నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభమయ్యాయి. గ్రామస్తులు, తల్లిదండ్రులు సమష్టిగా విద్యార్థుల విద్యాభివృద్ధికి ముందుకు వస్తే ఏ విధంగా ఉంటుందో చెప్పేందుకు విద్యా వలంటీర్ వ్యవస్థ చక్కటి ఉదాహరణ.

–కేఎస్ లక్ష్మణరావు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ

పాఠశాలను స్వయంగా పరిశీలిస్తా



పాఠశాలలో రెగ్యులర్‌గా నిర్వహిస్తున్న తరగతులతో పాటు సొంతంగా విద్య వలంటీర్లను నియమించుకుని ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించడం అభినందనీయం. ప్రభుత్వ విద్యావ్యవస్థలో ఇది నూతన ఒరవడికి శ్రీకారం చుడుతుంది. వెనిగండ్ల జెడ్పీ హైస్కూల్లో జరుగుతున్న ప్రత్యేక తరగతులను స్వయంగా పరిశీలించి, అక్కడి బోధన తీరు, తెన్నులు, విద్య వలంటీర్ వ్యవస్థ ద్వారా విద్యార్థులకు జరుగుతున్న మేలుపై ప్రభుత్వానికి నివేదిక పంపుతాను.

–బి. లింగేశ్వరరెడ్డి, ఆర్జేడీ, పాఠశాల విద్య

సంచలనాత్మక కేసుల్లో 'ప్రత్యేక' వాదన

- బాధితులకు అండగా నిలుస్తోన్న నాలుగో ఏడీజే కోర్టు స్పెషల్ పీపీ ఎన్.శారదామణి
- అనేక కేసుల్లో తన వాదన పటిమతో నిందితులకు శిక్షలు

రేపటికి ముందడుగు

పట్నంబజారు: ఎన్నో సంచలనాత్మక కేసుల్లో బాధితుల పక్షాన అండగా నిలబడి వినిపించిన వాదనలే.. నిందితులను ఉరికంబం ఎక్కేలా చేశాయి.. అమాయకుల పక్షాన చేసిన పోరాటం.. ముద్దాయిలకు జీవితఖైదు పడేలా చేసింది. ఎన్నో ముఖ్యమైన కేసుల్లో ఆమె చూపిన ప్రతిభకు ప్రశంసలు దక్కాయి. అయితే ప్రశంసలు, అభినందనలు, అవార్డుల కంటే బాధితులకు న్యాయం జరిగినప్పుడు కలిగే ఆనందమే ఎక్కువ సంతోషాన్ని కలిగిస్తుందని చెప్తారు ఆమె ఏడీజే కోర్టు స్పెషల్ పీపీగా పనిచేస్తున్న ఎన్.శారదామణి. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

సంచలనాత్మక కేసుల్లో కొన్ని..

రాష్ట్రంలోనే సంచలనం కలిగించిన బీటెక్ విద్యార్థిని రమ్య హత్య కేసులో నిందితుడైన శశికృష్ణకు న్యాయస్థానం ఉరిశిక్ష విధించిన విషయం విధితమే. ఈ కేసులో మృతురాలి తరఫున పూర్తిస్థాయిలో ప్రాసిక్యూషన్ వాదనలు వినిపించి నిందితుడిని ఉరి కంభం ఎక్కించారు. రేపల్లె రైల్వేస్టేషన్‌లో కూలి పనులు చేసుకునేందుకు వచ్చి నిద్రించిన మహిళను అత్యాచారం చేసిన కేసులోనూ స్పెషల్ పీపీ శారదామణి వాదనలు వినిపించారు. కేవలం నెలల వ్యవధిలోనే నిందితులు విజయకృష్ణ, నిఖిల్‌కు యావజ్జీవ కారాగార శిక్ష పడేందుకు ఎంతగానో పాటుపడ్డారు. రమ్య హత్య కేసులో కీలకంగా వ్యవహరించిన వాదనలు వినిపించిన ఆమెకు ఆగస్టు 15 సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధర్మాన ప్రసాదరావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.



మంత్రి ధర్మాన చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్న స్పెషల్ పీపీ శారదామణి (ఫైల్)

బాధితుల పక్షాన నిలవడం ఎంతో తృప్తినిస్తుంది



బాధితుల పక్షాన వాదనలు వినిపించి, వారికి అండగా నిలవటంతో పాటు నిందితులకు జైలు శిక్ష పడేలా కృషి చేయటం ఎంతో తృప్తినిస్తుంది. అనేక కేసుల్లో బాధితుల కుటుంబ సభ్యులను చూస్తుంటే ఎంతో బాధకలుగుతుంది. అందరి సహకారంతోనే సంచలనాత్మక కేసుల్లో శిక్షలు పడేలా వాదించగలిగా.

– ఎన్.శారదామణి, నాలుగో ఏడీజే స్పెషల్ పీపీ



జగనన్న పాలనలో మహిళలే మహరాణులు

జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము

కొరిటెపాడు(గుంటూరు): మాతృమూర్తులకు బిడ్డగా.. ఆడపడుచులకు సోదరుడుగా.. వేసే ప్రతి అడుగులోను, చేసే ప్రతి ఆలోచనలోను మహిళా పక్షపాతమే వహిస్తూ.. మహిళలను మహారాణులుగా.. కోటీశ్వరులుగా.. తీర్చిదిద్దాలనే ఏకైక లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ముందుకు సాగుతున్నట్లు జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము) వెల్లడించారు. బ్రాడీపేటలోని జీడీసీసీ బ్యాంకులో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి.

ఈ సందర్భంగా బ్యాంకు సీఈఓ టి.కష్టవేణి అధ్యక్షతన జరిగిన సభలో సీనియర్ సివిల్ జడ్జి టి.లీలావతి మాట్లాడుతూ అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్క మహిళా నిత్యం జాగరూకులై వ్యవహరించాలని సూచించారు. అనంతరం కేక్ కట్ చేసి ఆనందోత్సాహాల నడుమ వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బ్యాంక్ సీఈఓ కష్టవేణి, బ్యాంక్ జనరల్ మేనేజర్లు మాధవి, ఫణి, యూనియన్ నాయకుడు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న సివిల్ జడ్జి లీలావతి

కృషి భవన్‌లో..



అడిషనల్ డైరెక్టర్ ప్రమీలను సత్కరిస్తున్న విజయ భారతి, అమలకుమారి, అన్నపూర్ణ

కొరిటెపాడు(గుంటూరు): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం కృషి భవన్‌లో వ్యవసాయ అధికారుల రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. వ్యవసాయ వృత్తిలో రాణిస్తున్న పలువురు మహిళా అధికారులను సత్కరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ డి.ప్రమీల, కమిషనరేట్ జేడీఏ ఎం.విజయ భారతి ప్రసంగించారు. అనంతరం ఆట పాటల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, గుంటూరు ఏడీఏ సునీల్, గుంటూరు వ్యవసాయాధికారుల సంఘం జిల్లా ప్రెసిడెంట్ సునీల్ మహిళలందికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం మహిళా కార్యదర్శి కె.అమల కుమారి, పద్మజ, రిటైర్డ్ ఏడీఏ ఐ.వి జయభాను, డాక్టర్ ప్రవీణ్, శ్రీనివాస్ శాస్త్రి, సుజాత సుమ, అన్నపూర్ణ, గౌతం ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవో హోంలో..

గుంటూరు మెడికల్: ఏపీ ఎన్జీవో హోంలో గురువారం మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ఏపీ ఎన్జీవో మహిళ విభాగం జిల్లా చైర్‌పర్సన్ రాధారాణి అధ్యక్షతన జరిగిన వేడుకలకు గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) డాక్టర్ శోభారాణి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు.ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, ఏపీ ఎన్జీవో జిల్లా సెక్రటరీ శెట్టి సతీష్‌కుమార్, ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, సంయుక్త కార్యదర్శి శ్యామ్‌సుందర్, మహిళ సంయుక్త కార్యదర్శి శివజ్యోతి, మహిళ విభాగం జిల్లా కన్వీనర్ లక్ష్మీ రమ్య, నగర కార్యదర్శి చింతల కళ్యాణ్‌కుమార్, శ్రీనివాసరావు, విజయ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే డీఆర్ఎం కార్యాలయంలో..



గుంటూరు రైల్వే డివిజన్‌లో శుభాకాంక్షలు తెలియజేస్తున్న డీఆర్ఎం రామకృష్ణ

లక్ష్మీపురం: ప్రస్తుతం అన్ని రంగాల్లో మహిళలు ముందంజలో ఉన్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం ప్రత్యేక చట్టాలను సైతం అమలు చేయడం అభినందనీయమని గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్ఎం రామకృష్ణ అన్నారు. స్థానిక పట్టాభిపురంలోని గుంటూరు రైల్వే డీఆర్ఎం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మహిళల పట్ల ప్రత్యేక పథకాలను, వారి అభ్యున్నతి కోసం అనేక రకాలుగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ డీఈఎన్ కో ఆర్డినేషన్ జె.వి.అనూషా, సీనియర్ డీపీఓ షేక్.షాహబాజ్ హనూర్, సీనియర్ డీఓఎం దినేష్‌కుమార్, సీనియర్ డీఎంఈ హర్ష, సీనియర్ డీఎస్ఓ విజయ్‌కిర్తీ, డీఎస్సీ హరప్రసాద్, మహిళా గుంటూరు డివిజన్ మహిళా సంక్షేమ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

కాంటినెంటల్‌లో మాక్ ఎక్సర్‌సైజ్

తెనాలి జేసీ ఆధ్వర్యంలో నిశితంగా పరిశీలన

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని కాంటినెంటల్ ఫ్యాక్టరీలో (సీసీఎల్)లో గురువారం తెనాలి సబ్ కలెక్టర్ ప్రకాష్ జైన్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీ ఎం.వి. శివకుమార్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీ కుమారి ఆధ్వర్యంలో మాక్ ఎక్సర్‌సైజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫ్యాక్టరీలో ప్రమాదం జరిగిన సమయంలో కార్మికులు, యాజమాన్యం ఎలా స్పందించాలనే అంశం దగరి నుంచి వివిధ శాఖల అధికారులు, జిల్లా యంత్రాంగం సంఘటనా స్థలానికి వచ్చి ప్రమాదాన్ని ఏ విధంగా నియంత్రిస్తారనే విషయాన్ని మాక్ ఎక్సర్‌సైజ్ ద్వారా కార్మికులకు వివరించారు. ముందుగా ఫ్యాక్టరీ యాజమాన్యం విపత్తుల నివారణా సంస్థతో పాటు జిల్లా కలెక్టర్‌కు సమాచారం ఇవ్వాలని, జిల్లా అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద నివారణకు సంబంధించి ఆయా శాఖల ఆధ్వర్యంలో సహాయక చర్యలు ఏ విధంగా చేస్తారు అనే విషయాలను వివరించారు. మాక్ ఎక్సర్‌సైజ్‌లో భాగంగా మొదట అమ్మోనియా లీక్ అయినపుడు రెస్క్యూటీం అరికట్టే లోపు కర్మాగారంలోని ఎల్‌పీజీ గ్యాస్ లీక్ అయ్యి ఇంకొక ప్రమాదకర పరిస్థితి ఏర్పడితే, కర్మాగారంలోని రెస్క్యూటీం వాటిని అరికట్టే లోపు ఏవిధంగా చర్యలు తీసుకోవాలో వివరించారు. జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్ ద్వారా ఎటువంటి సహాయ సహకారాలు అందిస్తారనే విషయాన్ని జాయింట్ కలెక్టర్ ప్రకాష్ జైన్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీ ఎటువంటి సహాయ సహకారాలు అందిస్తారో సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ అన్నపూర్ణ, విపత్తుల నివారణ శాఖ సిబ్బంది, పోలీస్, మెడికల్, అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జిల్లా యంత్రాంగం ఎలా పనిచేస్తుందన్న విషయాన్ని వివరిస్తున్న జాయింట్ కలెక్టర్

సాధ్యమైనంత త్వరగా సమస్యలకు పరిష్కారం

డీపీఓలో విభాగాలను తనిఖీ చేసిన ఎస్పీ

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని పలు సెక్షన్లల్లో విధులు నిర్వర్తించే సిబ్బందికి ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే నేరుగా సంప్రదించవచ్చునని ఎస్పీ తుషార్ డూడీ వెల్లడించారు. గురువారం డీపీఓలోని విభాగాలలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏ, బీ సెక్షన్లల్లోకి వెళ్లి, సూపరింటెండెంట్లు మినిస్టీరియల్ సిబ్బందితో జిల్లా ఎస్పీ మాట్లాడారు. జిల్లాలోని పోలీస్ అధికార, సిబ్బందికి సంబంధించి వార్షిక ఇంక్రిమెంట్స్, పిల్లల ఉన్నత విద్య పథకం, విశ్రాంత ఉద్యోగుల పింఛన్, ప్రమాదవశాత్తు మరణించే ఉద్యోగుల కుటుంబ సభ్యులకు వర్తించే రాయితీలు, పెండింగ్ బకాయిలను సకాలంలో చెల్లించాలని ఆదేశించారు. ఏ ఒక్కరి పనులను పెండింగ్‌లో ఉంచవద్దని స్పష్టం చేశారు. సాధ్యమైనంత త్వరగా చెల్లింపులు జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. డీపీఓ ఉద్యోగ / సిబ్బంది సంక్షేమ దృష్ట్యా మినిస్టీరియల్ సిబ్బంది పరిష్కరించే విధంగా విధులు నిర్వర్తించాలని చెప్పారు. జిల్లా ఎస్పీ వెంట అదనపు ఎస్పీలు జీవీ రమణమూర్తి (పరిపాలన) ఎ.శ్రీనివాసరావు (క్రైం), ఏఏఓ వెంకటేశ్వరరావు, ఏ, బీ సెక్షన్ల సూపరింటెండెంట్‌లు హిమవంతరావు, శంకరరావు, ఎస్‌బీ సీఐ వెంకటరావు, ఎస్పీ సీసీ ఆదిశేషు ఉన్నారు.

పల్నాడులో ఆరుగురు ఇంటర్ విద్యార్థుల డిబార్

సత్తెనపల్లి: పల్నాడు జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఆరుగురు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్ చేస్తూ పట్టుపడ్డారు. గురువారం సీనియర్ ఇంటర్మీడియట్ గణితం -2 పరీక్షలో చిలకలూరిపేట మోడరన్ జూనియర్ కళాశాలకు చెందిన ఒకరు, నూజెండ్ల మండలం ఉప్పలపాడు ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్‌జేసీలో ఒకేషనల్‌కు సంబంధించిన ఐదుగురు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడినట్లు పల్నాడు జిల్లా డివీఈవో నీలావతిదేవి తెలిపారు. జిల్లాలో జనరల్, ఒకేషనల్ కలిపి 14,322 మంది హాజరు కావాల్సి ఉండగా 13,760 మంది హాజరయ్యారు. 556 మంది గైర్హాజరయ్యారు.

నుదురుపాడులో డ్రైవరు మృతి

మరొకరికి తీవ్రగాయాలు

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు ఆగి ఉన్న లారీని మిర్చిలోడుతో వస్తున్న మరోలారీ ఢీకొన్న ఘటనలో లారీ డ్రైవర్ మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మరో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం బెంగుళూరు నుంచి విజయవాడ వెళుతున్న లారీ మండలంలోని నుదురుపాడు గ్రామ శివారులో ఆగి ఉంది. నంద్యాల నుంచి మిర్చిలోడు తీసుకొని గుంటూరు వెళ్తున్న మరోలారీ ఆగిఉన్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో నంద్యాల జిల్లా బుజునూరుకు చెందిన మిర్చిలోడు లారీ డ్రైవర్ సుబ్బారావు (47) అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా లారీలోని మరో యువకుడు పవన్‌కు తీవ్రగాయాలయ్యాయి. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పి.వీరనారాయణ తెలిపారు.

నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు

- విద్యుత్ శాఖ రాష్ట్ర టెక్నికల్ డైరెక్టర్ జయభారతరావు
- ఏర్పాట్లు పరిశీలన

అమరావతి: మహాశివరాత్రి ఉత్సవాలకు పంచారామక్షేత్రమైన అమరావతిలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు విద్యుత్‌శాఖ రాష్ట్ర టెక్నికల్ డైరెక్టర్ బి. జయభారతరావు చెప్పారు. గురువారం రాత్రి ఆయన అమరావతి దేవస్థానంలో, అమరేశ్వర ఘాట్‌లో విద్యుత్‌శాఖ చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ శివరాత్రి ఉత్సవాలలో మూడురోజులు అదనంగా 50మంది సిబ్బందిని, పర్యవేక్షణకు నలుగురు ఏఈలను నియమించామని తెలిపారు. దేవాలయ పరిసర ప్రాంతాలకు రెండు 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా సరఫరా చేస్తామన్నారు. దేవాలయానికి 11 కేవీ ఎక్స్‌ప్రెస్ ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. అలాగే తాడికొండ, రాయపూడి లైన్‌ల నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తున్నామన్నారు. ఎస్ఈ పి.విజయకుమార్, ఈఈ టి తులసీరాం, ఏడీఈ కోటేశ్వరరావు, ఏఈ అశోక్‌కుమార్, ఎల్ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



